
రాంబాబుకి చాలా సంతోషంగా వుంది. వాడి ఆనందం వాడి అడుగుల్లో కనిపిస్తోంది.

చొక్కా జేబులో వున్న పది రూపాయల నోటు ఎడంచేత్తో జేబుమీద నుంచి గట్టిగా పట్టుకుని రోడ్డుమీద పరిగెడుతున్నట్టుగా నడుస్తున్నాడు రాంబాబు.

రాంబాబుకి అంత సంతోషంగా ఎందుకుందంటే వాళ్ళ అమ్మ ఈ రోజు చాలా సంతోషంగా వుంది. వాడికి జ్ఞానం తెలిశాక వాళ్ళ అమ్మ ముఖంలో అంతకాంతిని వాడెప్పుడూ చూడలేదు. ఆవిడ కళ్ళలో ఈ రోజు కనిపించిన నిబ్బరం వాడికి చాలా గొప్పగా కనిపించింది.



# అక్షతలు

— భైరవయ్య

ఆవిడ పెదాలు ఎప్పుడూ నవ్వుతూ వున్నట్టు కనిపించినా, ఆవిడ కళ్ళు ఏవో అగాధాలు దాచుకుని వున్నట్టు కనిపించేవి. నీరవ నిశీధులేవో ఆవిడ కళ్ళలో ప్రతిధ్వనులు చేస్తున్నట్టుండేవి. ఈ రోజే మొదటిసారిగా గుండెలనిండా గాలి పీల్చుకున్నట్టుగా వుందేమె. ఎదురింటి బియ్యం పంతులుగారి మేడమీద వెన్నెల్లా వెలిగే దీపంలా, వాళ్ళ అమ్మ ముఖం కనిపించడం, వాడి పదమూడేళ్ళ గుండెలు, పట్టలేనంత సంతోషంగావుంది.

రాంబాబుకి అంత చెప్పలేనంత సంతోషంగా ఎందుకుందంటే పొద్దుటే పక్కింటి తాతయ్యగారు వచ్చి, అమ్మా వసుమతీ, నీ నెంబరెంతమ్మా' అనడిగారు.

"రిజల్ట్సు వచ్చేశాయా బాబయ్యగారూ" అంటూ అడిగింది రాంబాబు తల్లి.

"అవునమ్మా"

అమ్మ నెంబరు చెప్పింది.

తాతగారు నెంబరుచూచి, 'నువ్వు ఫస్ట్‌క్లాసులో పాసయ్యావమ్మా" అన్నారు కళ్ళజోడు తీసి, కళ్ళు తుడుచుకుంటూ!

అమ్మకి పొలమారింది. ఒక్కక్షణం అమ్మ ఏమీ మాట్లాడలేదు. నోటికి కొంగు అడ్డం పెట్టుకుని "మీ అభిమానంకాని, నాకు ఫస్ట్‌క్లాసేమిటి బాబయ్యగారూ" అంది. అలా అంటున్నప్పుడు అమ్మ గొంతు అలా ఎందుకయిందో రాంబాబుకి అర్థం కాలేదు. వాళ్ళ అమ్మ కంటి పొరల్లో కనిపించిన ఆనందంమటుకు వాడికి అర్థమయింది.

"నిజం తల్లీ, కావాలంటే చూడు. అయినా నీకు రాకపోతే ఇంకెవరికి వస్తుం

దమ్మా" అంటూ పేపరు అమ్మ కందించారు తాతగారు.

అమ్మ ఆ పేపరు ఎంతసేపు చూసిందని. అలా ఆ పేపరు చూస్తూ నిలబడిపోయింది. అమ్మ ముఖంలోనూ, తాతగారి ముఖంలోనూ, మారుతూ కనిపిస్తున్న ఆ భావాలేమిటో రాంబాబుకి అంతుబట్టలేదు, ఇద్దరూకూడా. ఏదో గొప్ప అనుభూతిని పంచుకున్నట్టుగా వుంది. తాతగారు నేలకేసీ. అమ్మ చూరుకేసీ చూస్తు ఎంతసేపు వుండిపోయారో!

రాంబాబు వాళ్ళిద్దరికేసి విచిత్రంగా చూస్తున్నాడు. గొప్ప సంగీతం విన్న తర్వాత, మిగిలిన నిశ్శబ్దం ఆ గదిలో నిండిపోయింది. అనుభవమే తప్ప అర్థాన్ని విడమరచలేని స్థితి స్పందిస్తున్న ఆనందం తప్ప—మాటలు.శబ్దాలు దగ్గరకు చేరడానికి భయపడే సమయం. తాతగారు నేలకేసీ, అమ్మ చూరుకేసి.ఇద్దర్నీ మార్చి మార్చి-కొత్త విషయాలేవో తెలుస్తున్నట్టు చూస్తూ రాంబాబు వుండిపోయాడు.

ఆ నిశ్శబ్దానికి భయపడింది రాంబాబు చెల్లెలు.

ఆ నిశ్శబ్దం భయం కలిగించేదిలా వుంది, ఆ నిశ్శబ్దమే ధైర్యాన్ని కలిగిస్తోంది. యుద్ధమయిపోయాక, ఓటమీ-గెలుపుల సంగతి తేలిపోయాక. మిగిలిపోయిన నిశ్శబ్ద మిది.మనసునివట్టి నొక్కేసే నిశ్శబ్ద మిది.

రాంబాబు చెల్లెలు మెల్లిగా కదిలింది. చప్పుడవుతే. ఆ నిశ్శబ్దం-మీదపడి పట్టేసుకుంటుందేమో-అని భయపడుతూ పాదాలు కదిల్చినట్టు కనిపించకుండాకదిలి రాంబాబు చెయ్యి పట్టుకుంది.

గదిలో నిశ్శబ్దం కదిలింది.

రాంబాబు తల్లి-రాంబాబుకేసి, రాంబాబు చెల్లెలికేసి చూసి పల్చగా నవ్వింది.

ఆనవ్వు ఎంతబావుందనీ అలా, వాళ్ళ అమ్మ నవ్వినందుకు రాంబాబుకి చాలా సంతోషమేసింది. ఆ నవ్వు. రోజూ నవ్వే అమ్మ నవ్వినట్టుగా లేదు. స్కూల్లో తెలుగు మేష్టారు వర్ణించే భారతమాత నవ్వినట్టుగా వుంది. వేసంకాలంలో ఆరుబయట పడుకున్నప్పుడు పరుచుకున్న వెన్నెల్లా వుంది.

"ఇదంతా మీ చలవ బాబయ్యగారూ" అంది రాంబాబుతల్లి.



"నాదేంలేదు తల్లీ. ఇదంతా నీ పట్టుదల.నేవెళ్ళి. ఆ హెడ్మాష్టర్నీ సెక్రటరీనీ కలుసుకుంటాను. ఇంక ఫరవాలేదమ్మా. వేణ్ణీళ్ళకి. చన్నీళ్ళు సాయం. ఒద్దు చేరిన పైలే వస్తానమ్మా" అంటూ వెళ్ళిపోయారు తాతగారు.

రాంబాబు తల్లికేసి చూశాడు. రాంబాబు చెల్లెలు 'అమ్మా' అంది.

'నేను పరీక్ష పాసయ్యానర్రా' అందావిడ, వాళ్ళిద్దర్నీ దగ్గరకు తీసుకుంటూ, చెల్లికి ఎనిమిదేళ్ళు- దానికేమీ తెలియదు. "ఏ పరీక్షమ్మా" అంది.

"దక్షిణభారత హిందీసభ రాష్ట్రభాష పరీక్షఫలితాలు" అన్న హెడ్డింగ్ చదివి "అమ్మ.పెద్ద హిందీ పరీక్ష పాసయ్యిందే మొద్దూ" అన్నాడు రాంబాబు.

"అమ్మా.అయితే జంతికలు చెయ్యవే అంది చెల్లి.

"ఎప్పుడూ తిండిగోడవే" అన్నాడు రాంబాబు.

"పెద్దగొప్ప-చేస్తే నువ్వుతినవేమిటి" అంది చెల్లి.

"తప్పురా- చెల్లిని ఏమీ అనకు" అని రాంబాబుతో చెప్పి. "అలాగేనమ్మా చేసుకుందాంలే" అంది.

"ఈవేళే చెయ్యమ్మా" అంది చెల్లి.

"అలాగేనన్నానా. మారాం చెయ్యకు. వెళ్ళి ఆడుకో" అంది అమ్మ.

అమ్మ. అయిదు నిమిషాలు గదిలో తచ్చాడింది. తరువాత "ఒరేయ్. కుక్కేస్తుంది. చూస్తూవుండు ఇప్పుడే అత్తయ్యగారింటికెళ్ళొస్తా" అంటూ పక్కింటికి వెళ్ళింది

అమ్మని చూస్తోంటే రాంబాబుకి వుత్సాహంగా వుంది. అమ్మ పక్కింటి అత్తయ్యగారింటికెళ్ళగానే. రెండు పిల్లి మొగ్గలేశాడు. ఓసారి ఎగిరి గంతేశాడు. నిక్కరు జేబులో చేతులెట్టుకుని. బుజాలు వెనక్కివిరిచి. ఆ గదిలో పచార్లుచేశాడు. గుమ్మందగ్గరకొచ్చి. రెండు చేతులూ గుమ్మానికి అటూయిటూ పెట్టి. వీధిలోకి చూస్తూ నిలబడ్డాడు.

* * * *

రాంబాబుకి యిప్పుడిప్పుడే విషయాలు తెలుస్తున్నాయి. వాటి రూపాలు స్పష్టాస్పష్టంగావున్నాయి. వాటికి కారణాలు.వాడి మేధకందనివిగా వుంటున్నాయి.ఎదురింటి బియ్యం పంతులుగారికి అంత మేడెందుకుందో.తాము రేకులుదింపిన పసారాలోనే ఎందుకుండాల్సొచ్చిందో వాడికి అర్థంకాని విషయం. వాళ్ళ నాన్న. మందుల కొట్లో పగలంతా పనిచేసి, రాత్రి ఏడింటికి దుకాణం కట్టెయగానే, రెండు వీధుల అవతలవున్న ప్లీడరుగారి దగ్గర, రాత్రి పదింటివరకు టైపు చెయ్యాల్సిన అవసరమేమిటో వాడి కింకా తెలియదు. అందరూ ఆదివారాలు యింట్లోనే వుంటే.వాళ్ళ నాన్న మటుకు ప్లీడరుగారి దగ్గర కెందుకెళ్ళాలో వాడి వూహ కందటంలేదు. ప్రతి నెలా కిరాణా కొట్టువాడిని, పాలవాడిని అమ్మ ఎందుకు బతిమాలుతుందో వాడి కర్థంకాని సమస్య. వాళ్ళ మామ్మ. కాళ్ళ వాపుతో మూడేళ్ళుగా బాధపడుతున్నప్పుడు "నీకున్నవి చాలక నా రోగంకూడా నిన్ను బాధపెడుతోందిరా విస్సు" అని. రాంబాబువాళ్ళ

నాన్నతో అంటూ, ఆవిడెందుకుకళ్ళనీళ్ళు పెట్టుకునేదో. వాడి ఆలోచనకందని విషయం. పక్కింటి తాతయ్యగారు, అమ్మతో మాట్లాడుతున్నప్పుడు, "బెంగెట్టుకో కూడదమ్మా పరిస్థితు, లెప్పుడూ ఒక్కలావుండవు. మనం లొంగిపోకూడదు. మన ప్రయత్నలోపం వుండకూడదు. ఆ రాష్ట్రభాష ఎలాగైనా పూర్తిచెయ్యి తల్లీ. నిన్నాస్కూల్లో పెట్టేపూచీ నాది" అని, ఎందుకు అంటూ వుండేవారో, ఇతమిత్థంగా తెలియదు వాడికి. వాడికి తెలిసినది, అర్థమయినది-డబ్బు అనవసరంగా ఖర్చుచెయ్యకూడదని. చిన్నచిన్న కోర్కెలు కూడా కోరుకోకూడదని. కోరుకుంటే అవి తీరవని. అందుకే వాడి చెల్లెలు ఎప్పుడన్నామారాంచేస్తే, వాడేనముదాయిస్తూ వుంటాడు. వాడి చెల్లెలు, అలా మారాంచేసినప్పుడు, వాళ్ళ అమ్మకి కోపం వస్తుందని వాడికి తెలుసు. కోప్పడ్డాక పక్కకి తిరిగి, ఆవిడ కళ్ళెందుకు తుడుచుకుంటుందో వాడికి సరిగ్గా తెలియదు. ఆవిడ కన్నీళ్ళు వాడు చూడలేదు. ఆవిడ నవ్వుతూ వుంటేనే వాడికి బాగుంటుంది. అందుకే వాడు ఏదీ అడగడు.

రాంబాబుకి ఈరోజు చాలా సంతోషంగా వుండడం తనకి చాలా యిష్టమని, చెప్పాలని వుంది.

* * * *


అమ్మ పక్కింటి అత్తయ్యగారింటి నుంచి వచ్చి, 'ఒరేయ్ రాంబాబూ, శరభయ్య కొట్టుకెళ్ళి, అరకిలో నంద్యాల నూనె తీసుకురా. ఈలోపున బియ్యం నానేస్తాను." అంది.



అమ్మ యిచ్చిన డబ్బా, పది రూపాయలు తీసుకుని, వీధిలోకి ఒక్క దూకు దూకాడు రాంబాబు- "ఒరేయ్ ఏమిట్రా ఆదూకడం. జాగ్రత్త. అంటున్న అమ్మ మాట వినిపించుకోకుండా.

రాంబాబుకి పట్టలేనంత ఆనందంగా వుంది. వాడి ఆనందం, వాడినడకలో వుంది.

రాంబాబు శరభయ్య కొట్లో నంద్యాల నూనె కొన్నాడు. చిల్లర రెండున్నర రూపాయలు మిగిలింది. నూనెడబ్బా గట్టిగా పట్టుకుని వస్తున్న రాంబాబుకి, నల్లగా- నిగనిగలాతుతున్న పుచ్చకాయలు కనిపించాయి. రాంబాబు ఆగిపోయి వాటికేసి చూసాడు.




రాంబాబుకి మాచెడ్డసంతోషంగావుంది.

రాంబాబు పుచ్చకాయలకేసి చూస్తూ నిలబడ్డాడు. చిన్నవి, పెద్దవి, మరీపెద్దవి రకరకాల సైజుల్లో కనిపిస్తున్నాయవి. వాటిల్లో తెల్లవి కూడా వున్నాయి. కోలగా, చారలవి కూడా వున్నాయి. పుచ్చకాయలమ్మేవాడి ఎదురుగా, రెండు మూడు కాయలు- మధ్యగా కోసినవి వున్నాయి. అవి ఎర్రగా, నల్లటిగింజలతో, నోరూరించేవిగా వున్నాయి. అటువంటి దుకాణాలు మూడున్నాయి.

రాంబాబుకి చాలా ఆనందంగావుంది. ఆ ఆనందాన్ని ఎవరితోనైనా పంచుకోవాలని వుంది.

ఎవరెవరోవచ్చి పుచ్చకాయలు కొనుక్కుని వెళుతున్నారు. పెద్దవాళ్ళు, పెద్దవాళ్ళతోపిల్లలు, రిక్షాల్లో వెళ్తున్నవాళ్ళు, సైకిలుమీద వస్తున్నవాళ్ళు, కార్లుఆపి-దిగి బేరమాడుతున్నవాళ్ళు, కార్లలో కూర్చునే అడుగుతున్నవాళ్ళు, అలా చాలామంది పుచ్చకాయలు కొనుక్కుంటున్న వాళ్ళని చూస్తున్నాడు రాంబాబు.

రాంబాబుకి సంతోషంగావుంది. ఎందుకు సంతోషంగా వుందో వాడికి తెలియదు. వాళ్ళఅమ్మ, సంతోషంగావుందని తెలుసు వాడికి. వాళ్ళఅమ్మ, ఎప్పుడూ అలా సంతోషంగా వుండాలని వాడి కోరిక.

రాంబాబు, ఒక పుచ్చకాయల కొట్టు దగ్గర కెళ్ళాడు. దగ్గరగా నిలబడి, ఆ పుచ్చకాయల్ని చూసాడు జేబులో డబ్బుల్ని తడుముకున్నాడు. మెల్లిగా, ఒక పుచ్చకాయని నిమిరాడు. నున్నగా, చెయ్యిజారిపోయేట్టుగా వుంది. చేతికి చల్లగావుంది. వాళ్ళ అమ్మ యిందాక నవ్వినట్టుగా వుంది.

"ఏటబ్బాయిగోరు కాయకొనడానికా-పట్టుకుపోడానికా" అన్నాడు కొట్టువాడు.

రాంబాబుకి కోపమొచ్చింది. వాడు తన శక్తిని శంకిస్తున్నట్టు అనిపించింది. ఆ కొట్టువాడికేసి చూసినచూపు, చాలా తీవ్రంగా వుంది.

"అంత కోపమెందుకయ్యా బాబు. సరదాకన్నాలే" అన్నాడా కొట్టువాడు.

రాంబాబు, వాడికేసి చూడకుండా, పక్క కొట్టువాడి దగ్గరకెళ్ళి, 'పుచ్చకాయెంత?' అనడిగాడు.

"ఏ కాయ కావాలి?" అనడిగాడా కొట్టువాడు.

"అసలెలాగ?"

"పెద్దది కావాలా? చిన్నది కావాలా?"

"పెద్దదెంత?"

రాంబాబుకి సంతోషంగా వుంది. వాళ్ళ అమ్మ సంతోషంగా వుంది. అందుకని వాడికి సంతోషంగా వుంది.

"అయిదు రూపాయలు" అన్నాడు కొట్టువాడు.

"తక్కువ కియ్యవా?" అన్నాడు రాంబాబు.

"నాలుగున్నరకి తక్కువలేదు."

రాంబాబుకి తన సంతోషాన్ని ఎవరో లాక్కుంటున్నట్టుగా అనిపించింది.

"చిన్నదెంత"

"మూడు రూపాయలు" అని చెప్పి, మరొకాయనతో బేరమాడుతున్నాడు కొట్టువాడు.

రాంబాబుకి వుక్రోషంగా వుంది. కొట్టువాడుతనని ఎగతాళి చేస్తున్నట్టు అనిపించింది.

"తక్కువకియ్యవా'" అనడిగాడు జేబులో చిల్లరనీ, గొంతులో వుక్రోషాన్నీ తడుముకుంటూ.

"రెండున్నరిచ్చి పట్టుకెళ్ళు"

కొట్టువాడి ధోరణి చాలా నిర్లక్ష్యంగా తోచింది రాంబాబుకి, జేబులో డబ్బులు మరోసారి తడిమి చూసుకున్నాడు.

"రెండురూపాయల కిస్తావా?" అనడిగాడు రాంబాబు.

కొట్టువాడు రాంబాబు గొంతు విని, రాంబాబుకేసిచూసాడు.గట్టిగా నవ్వి."భలే బేరమయ్యా పంతులూ. సరే పట్టుకెళ్ళు" అన్నాడు.

ఆనందంగా మారినవుక్రోషంరాంబాబు కళ్ళలోంచి వచ్చింది. రెండు రూపాయ నోట్లు జాగ్రత్తగా లెక్కబెట్టి యిచ్చాడు. ఆ యివ్వడం చాలా దర్జాగా యిచ్చాడు. "మంచికాయ చూసియ్యి" అని చాలా ధీమాగా చెప్పాడు.

కొట్టువాడో కాయతీసి, రాంబాబుకిచ్చి, నవ్వాడు, "జాగర్తగా పట్టుకెళ్ళు. కింద పడితే పగిలిపోద్ది" అన్నాడు.

"నాకు తెలుసు" అన్నాడు రాంబాబు.

ఒకచేత్తో నూనెడబ్బా చంకలో గట్టిగా పట్టుకుని. మరోచేత్తో పుచ్చకాయ బుజం మీంచిపడిపోకుండా పట్టుకుని, ఇంటికి బయల్దేరాడు.


రాంబాబుకి సంతోషంగా వుంది. వాళ్ళ అమ్మకి, తనసంతోషం తెలియజెప్పాలని వుంది. 'అమ్మా, నువ్వెప్పుడూ యిలాగే వుండాలమ్మ' అనిచెప్పి. ఆ పుచ్చకాయ వాళ్ళ అమ్మ చేతిలో పెట్టాలని వుంది.

తడబడుతున్న అడుగులతో, ఇంట్లోకి ధీమాగా అడుగుపెట్టాడు రాంబాబు.

ఇంట్లోకి అడుగుపెట్టిన రాంబాబుని, వాడిబుజంమీద బరువుని చూసింది వాళ్ళ అమ్మ. "అదేవిట్రా" అంది.

"పుచ్చకాయ" అన్నాడు రాంబాబు.

"అదెందు క్కొన్నావ్. డబ్బులు తేరగా వచ్చాయనుకున్నావా. నీకు జ్ఞానం ఎప్పుడొస్తుందిరా అందావిడ. ఆవిడ కంఠంలో కోపాన్ని మించిన భావం రాంబాబుకి అర్థంకాని భావం.




రాంబాబుకి ఏడుపొచ్చింది. వాళ్ళ అమ్మకి కోపమొచ్చిందని ఏడుపొచ్చింది. వాళ్ళ అమ్మ సంతోషపడలేదని ఏడుపొచ్చింది.వాళ్ళ అమ్మ సంతోషం పాడు చేసినందుకు ఏడుపొచ్చింది.

రాంబాబు ముఖంలోకి చూసిన వాళ్ళ అమ్మకి.అశక్తతలోంచి కోపమొచ్చింది. ఆ కోపంలోంచి బాధకలిగింది. ఆ బాధ లోంచి ఆక్రోశం కలిగింది. ఆ ఆక్రోశం లోంచి కోపమొచ్చింది.

"ఇప్పుడెందుకురా ఆ కాయకొనడం. జంతికలు చేస్తున్నాగా. అనవసరంగా డబ్బు తగలేస్తే ఎక్కడ్నుంచి వస్తుందను కున్నావ్. అసలెందుక్కొన్నావ్?"

రాంబాబుకి నిజంగా ఏడుపొచ్చింది. వాళ్ళ అమ్మకి కోపం తెప్పించిన, తన సంతోషంమీద కోపమొచ్చింది. వాళ్ళ అమ్మ ఆనందాన్ని చెడగొట్టినందుకు, తన మీద తనకే కోపమొచ్చింది. ఆకోపం గుండెల్ని పట్టి పిండింది. అది- కళ్ళ ల్లోంచి, కంఠంలోంచి పైకొచ్చింది.

"నువ్వు పాసయ్యావనికొన్నానమ్మా"

రాంబాబు కంఠంలో వుబికిన బాధ, రాంబాబుతల్లి గుండెల్ని పట్టింది. వాడి సాహసాన్ని అర్థంచేసుకున్నా. కోపగించు కున్న తన నిస్సహాయతమీద ఆక్రోశ మొచ్చింది. ఆవిడ తల్లిపేగు గుబగుబ లాడింది. ఒక్కక్షణం, రాంబాబుకేసి వరదకమ్మిన కళ్ళతో చూసింది.

రాంబాబు బుజంమీదనుంచి కాయతీసి పట్టుకుని, వాడిని దగ్గరకు లాక్కుని, తల మీద గడ్డంపెట్టి,"పోన్లే ఇంకెప్పుడూఅలా చెయ్యకు, అనవసరంగా డబ్బు ఖర్చు పెట్టకూడదు నాన్నా" అంది, ఆవిడ అలా అంటున్నప్పుడు,బాధని చీల్చుకుని వచ్చిన నవ్వు రాంబాబుని చుట్టేసింది.

రాంబాబు, వాళ్ళ అమ్మని గట్టిగా పట్టుకుని, పొట్టలో తలపెట్టుకున్నాడు. రాంబాబు కళ్ళు,వాళ్ళ అమ్మపొట్టమీద తడిగా వున్నాయి. రాంబాబు తలమీద- సన్నగా, వెచ్చగా నీటిచుక్కలు. పూలు కురిసినట్టు- అక్షతలుపడ్డట్టు.

రాంబాబుకి చాలా ఆనందంగా వుంది- చెప్పలేనంత ఆనందంగా వుంది.ఆ ఆనందంవాళ్ళ అమ్మ వొడిలా వెచ్చగా వుంది.